# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 17-07-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

❖ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 19వ తేదీ నుండి మోల్డోవా, నార్త్ మాసిడోనియా, రొమేనియా దేశాలలో అధికారికంగా పర్యటించనున్నారు.

❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "అమృత్ భారత్ స్టేషన్" పథకం కింద అభివృద్ధి చేసిన 75 రైల్వే స్టేషన్లను ఈరోజు ప్రారంభించారు.

❖ మహిళలకు సురక్షితమైన పని వాతావరణాన్ని సృష్టించడం ప్రభుత్వాల, సంస్థల ఉమ్మడి బాధ్యత అని కేంద్రమంత్రి అన్నపూర్ణా దేవి ఉద్ఘాటించారు.

❖ పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈనెల 20వ తేదీన ప్రారంభం కానున్నాయి.

=======================

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 19వ తేదీ నుండి మోల్డోవా, నార్త్ మాసిడోనియా, రొమేనియా దేశాలలో అధికారికంగా పర్యటించనున్నారని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. 20వ తేదీన ఆమె మోల్డోవాను సందర్శించి... ఆ దేశ అధ్యక్షురాలు మాయా సాండుతో సమావేశమై ప్రతినిధుల స్థాయి చర్చలు జరుపుతారు. అలాగే.. మోల్డోవా పార్లమెంట్ అధ్యక్షుడు ఇగోర్ గ్రోసుతో సమావేశమై, మోల్డోవా-భారత్ పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ గ్రూప్ సభ్యులతో సంభాషిస్తారు. ఈ నెల 21వ తేదీన నార్త్ మాసిడోనియాను సందర్శించి, ఆ దేశ అధ్యక్షురాలు గోర్డానా సిల్జానోవ్స్కా-డావ్కోవాతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. అలాగే ప్రధానమంత్రి క్రిస్టిజన్ మిక్కోస్కి తోను, అసెంబ్లీ అధ్యక్షుడి తోను సమావేశమై.. నార్త్ మాసిడోనియా అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగించనున్నారు. 23వ తేదీ నుండి జరిగే 2 రోజుల రొమేనియా పర్యటనలో భాగంగా రాష్ట్రపతి.. ఆ దేశ అధ్యక్షులు నికుషోర్ డాన్, తాత్కాలిక ప్రధానమంత్రి ఇలీ బోలోజన్, సెనేట్ అధ్యక్షులు మిర్సియా అబ్రుడియన్, ఛాంబర్ ఆఫ్ డిప్యూటీస్ అధ్యక్షుడు సోరిన్ గ్రిండియానూలతో సమావేశమవుతారు.

=======================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు పంజాబ్‌లోని జలంధర్‌లో 5 వేల 470 కోట్ల రూపాయలకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. `అమృత్ భారత్ స్టేషన్` పథకం కింద అభివృద్ధి చేసిన 75 రైల్వే స్టేషన్లను

ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. జలంధర్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో ప్రధానమంత్రి మాట్లాడుతూ... కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం దేశంలోని పౌరుల జీవితాలను సులభతరం చేయడం, వారి పురోగతి కోసం నూతన అవకాశాలను కల్పించడం వంటి వాటికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పేద, ధనిక అనే భేదం లేకుండా ప్రతి కుటుంబానికి ఉత్తమ సౌకర్యాలు అందించడమే తమ ఉద్దేశ్యమని స్పష్టం చేశారు. నాగరిక్ దేవో భవ స్ఫూర్తి.. ప్రభుత్వం చేపట్టే ప్రతిపనిలోనూ ప్రతిబింబిస్తుందని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకెన్లు)

అంతకుముందు.. ప్రధానమంత్రి చండీఘర్‌లో ఆరోగ్య సంరక్షణ, విద్య, రహదారి మౌలిక సదుపాయాల వంటి కీలక రంగాలలో సుమారు 4 వేల 700 కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభను ఉద్దేశించి నరేంద్ర మోదీ మాట్లాడుతూ... చండీఘర్ అభివృద్ధితో ప్రజల జీవితాలు మారిపోయాయని, ఈ ప్రయోజనాలు ఆ నగరానికే పరిమితం కాకుండా హర్యానా, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ ప్రజలకు కూడా చేరాయని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

మహిళా నేతృత్వంలోని అభివృద్ధి లక్ష్యాన్ని సాకారం చేసుకునేందుకు సురక్షితమైన, గౌరవప్రదమైన పని ప్రదేశాలు చాలా అవసరమని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణా దేవి అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు ప్రారంభమైన `పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, నిషేధం, పరిష్కార చట్టం - 2013పై` జాతీయ మహిళా కమిషన్ (NCW) నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రతి మహిళకు గౌరవంగా, నిర్భయంగా పనిచేసే హక్కు ఉందని, సురక్షితమైన పని వాతావరణాన్ని సృష్టించడం ప్రభుత్వాలు, యజమానులు, సంస్థల ఉమ్మడి బాధ్యత అని ఉద్ఘాటించారు. శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడానికి, సమ్మిళిత జాతీయ అభివృద్ధిని సాధించడానికి పని ప్రదేశంలో భద్రతను బలోపేతం చేయడం తప్పనిసరి అని అన్నపూర్ణాదేవి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈ నెల 20వ తేదీన ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల 13 వరకు జరగనున్న ఈ సమావేశాలలో కొన్ని కీలకమైన అంశాలను చర్చించి, సభ ఆమోదం పొందాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, రాజీవ్ రంజన్ సింగ్, కింజరాపు రామ్మోహన్ నాయుడు, కిరణ్ రిజిజులు ఈరోజు ఢిల్లీలో సమావేశమై వ్యూహాన్ని ఖరారు చేశారు. అలాగే.. ఈ నెల 19న ప్రభుత్వం అన్ని పార్టీల నాయకులతో సమావేశానికి ఏర్పాటు చేసింది. పార్లమెంట్ ఉభయ సభలు సజావుగా పని చేసేలా సహకరించాలని ప్రభుత్వం ఈ సమావేశంలో అన్ని రాజకీయ పార్టీలను కోరనుంది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్యానాలోని జింద్ రైల్వే స్టేషన్‌లో భారతదేశపు మొట్టమొదటి హైడ్రోజన్ ఆధారిత రైలును ఈరోజు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ... గత 12 సంవత్సరాల్లో భారతీయ రైల్వేలో అనేక కీలక మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. జింద్ - సోనిపట్ మార్గంలో సుమారు 90 కిలోమీటర్ల దూరం హైడ్రోజన్ రైలు సేవలు ప్రారంభమయ్యాయని, భవిష్యత్‌లో ఇవి మరింత విస్తరిస్తామని తెలిపారు. 3 వేల 200 హార్స్ పవర్‌తో పని చేసే ఈ రైలు ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన, పొడవైన హైడ్రోజన్ రైళ్లలో ఒకటని చెప్పారు. ప్రస్తుతం ప్రపంచంలో 3, 4 దేశాలకు మాత్రమే హైడ్రోజన్ రైళ్లను నడిపే సామర్థ్యం ఉందన్న ప్రధానమంత్రి.. 21వ శతాబ్దపు భారతీయ రైల్వేలు హైడ్రోజన్ సాంకేతికతతో నడుస్తాయని పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకెన్లు)

ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ... హైడ్రోజన్ సాంకేతికతను దేశీయంగా అభివృద్ధి చేయాలన్న బలమైన జాతీయ సంకల్పంతోనే దేశంలో మొట్టమొదటి హైడ్రోజన్ రైలు ప్రారంభమైందని, ఇది స్వదేశీ సాంకేతిక ప్రగతిలో ఒక చారిత్రక విజయమని అభివర్ణించారు. ఈ రైలుకు డీజిల్ కాని, పెట్రోల్ కాని అవసరం లేదని, ఇది పూర్తిగా పర్యావరణ అనుకూలమైనదని పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా నరేంద్ర మోదీ ప్రభుత్వం చేపట్టిన విస్తృత రైల్వే ఆధునీకరణ కార్యక్రమంలో ఈ విజయం ఒక భాగమని చెప్పారు. హర్యానా రాష్ట్ర రైల్వే బడ్జెట్ 315 కోట్ల రూపాయల నుండి సుమారు 3 వేల 500 కోట్ల రూపాయలకు గణనీయంగా పెరిగిందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు 18 వేల కోట్ల రూపాయల విలువైన రైల్వే ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయని అశ్వినీ వైష్ణవ్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకెన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన (AB PM-JAY) ద్వారా దేశవ్యాప్తంగా లక్షా 90 వేల కోట్ల రూపాయలకు పైగా విలువైన నగదు రహిత చికిత్సలు జరిగాయని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ తెలిపారు. న్యూఢిల్లీలో AB PM-JAY, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ABDM) అమలుపై జరిగిన 2 రోజుల జాతీయ సమీక్షా సమావేశంలో ఆయన ఈరోజు మాట్లాడుతూ.. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య భరోసా పథకంగా నిలిచిందన్నారు. 94 కోట్లకు పైగా ABHA నంబర్ల ఏర్పాటు, 100 కోట్లకు పైగా ఆరోగ్య రికార్డుల అనుసంధానంతో.. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఉండే ఆరోగ్య సంరక్షణ వ్యవస్థకు ABDM డిజిటల్ పునాదిని వేసిందని మంత్రి వివరించారు. అత్యంత పేద, బలహీన వర్గాల ప్రజలను అన్ని ఆరోగ్య సంరక్షణ చర్యల కేంద్ర బిందువుగా ఉంచుతూ.. ఈ పథకాల అమలులో సమన్వయాన్ని బలోపేతం చేయాలని ప్రతాప్‌రావు జాదవ్ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు పిలుపునిచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్ పరిసర ప్రాంతాలపై ఉన్న అల్పపీడనం బలహీనపడి సాధారణ అల్పపీడనంగా మారిందని భారత వాతావరణ విభాగం (ఐఎండి) తెలిపింది. రానున్న 7 రోజుల్లో ఈశాన్య భారతదేశం, ఉప-హిమాలయ పశ్చిమ బెంగాల్, సిక్కిం, బీహార్, ఉత్తర ప్రదేశ్ ప్రాంతాలలో అక్కడక్కడా భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = =